క్లుప్తంగా

నేడు దుప్పట్లు, పండ్ల పంపిణీ

కూకట్‌పల్లి: ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు జన్మదినం పురస్కరించుకొని నియోజకవర్గ ఎస్సీ విభాగ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10గంటలకు స్మైల్ ఏ గిఫ్ట్ కార్యక్రమంలో భాగంగా శివానంద ఆసుపత్రిలోని రోగులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేయనున్నట్లు కూకట్‌పల్లి బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎస్సీ విభాగం బొట్టు విష్ణు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి బాలాజీనగర్ డివిజన్ కార్పొరేటర్ పగుడాల శిరీష బాబురావు, నియోజకవర్గ కోఆర్డినేటర్ సతీష్ అరోరా పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రెడ్డి ఐక్యవేదిక కన్వీనర్‌గా కొండల్‌రెడ్డి



నియామక పత్రం అందుకుంటున్న కొండల్‌రెడ్డి

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గం రెడ్డి ఐక్యవేదిక కన్వీనర్‌గా సీహెచ్. కొండల్‌రెడ్డిని నియమించారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు ఏనుగు సంతోష్‌రెడ్డి నియామకపత్రాన్ని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా కొండల్ రెడ్డి మాట్లాడుతూ... రెడ్డి ఐక్యవేదిక అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. ఐక్యవేదిక చేపట్టే అన్ని కార్యక్రమాలకు సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. తనను కన్వీనర్‌గా నియమించిన అధ్యక్షుడు సంతోష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

21 నుంచి దస్తకారీ హాత్ క్రాఫ్ట్ బజార్

రాయదుర్గం: భారతదేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన హస్తకళాకారులు రూపొందించిన ఉత్పత్తులను ప్రదర్శించేందుకు గచ్చిబౌలిలో ఏర్పాట్లు చేస్తున్నారు. నగరంలో తొలిసారిగా దస్తకారీ హాత్ క్రాఫ్ట్స్ బజార్ నిర్వహించనున్నారు. గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్(నిథమ్) ప్రాంగణంలో ఈనెల 21వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ఉదయం 11గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు 'దస్తకారీ హాత్ క్రాఫ్ట్ బజార్' పేరిట ప్రత్యేక ప్రదర్శన జరగనుంది.

విష్ణుసాగర్‌కు రూ.2.5లక్షల చెక్కు



లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన జి. విష్ణుసాగర్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.2.5లక్షల చెక్కు మంజూరయ్యింది. ఈ మేరకు సదరు చెక్కును ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు శుక్రవారం లబ్ధిదారుడికి అందజేశారు. నియోజకవర్గంలోని ప్రజలు దరఖాస్తు చేసుకొని లబ్ధిపొందాలని కోరారు.

అడ్డా కూలీలకు అవగాహన

హఫీజ్‌పేట్: లేబర్ అడ్డా వద్ద ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించరాదని హఫీజ్‌పేట్ చిల్లా లేబర్ అడ్డా కూలీలకు పోలీసులు శుక్రవారం అవగాహన కల్పించారు. ఎస్ఐ దశరథ్ మాట్లాడుతూ పనులు చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా మహిళా కూలీలు అపరిచితులను నమ్మవద్దని, ఒక వేళ ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు తెలియపర్చాలని సూచించారు.

ఘనంగా ప్రగతి కళాశాల వార్షికోత్సవం



కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని ప్రగతి జూనియర్ కళాశాల వార్షికోత్సవం శుక్రవారం ఆల్విన్‌కాలనీలోని ఎంఎల్ఎన్ గార్డెన్స్‌లో జరిగింది. విద్యార్థులు ఆటాపాటలతో అలరించారు. కళాశాల కరస్పాండెంట్ రవీందర్‌రావు మాట్లాడుతూ.. మారుతున్న సమాజానికి తగ్గట్టుగా విద్యార్థులు ఆధునిక, ఉపాధి కల్పన కోర్సులు అభ్యసించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ శ్రీధర్‌రావు, ప్రిన్సిపాల్ చెన్నయ్య, వినోద్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

20 నుంచి ప్రత్యేక వర్క్‌షాప్

రాయదుర్గం: మనూ ఫ్యాకల్టీ సభ్యుల కోసం ఈనెల 20వ తేదీ నుంచి 27వ తేదీ వరకు 'ఇ-కంటెంట్ ప్రొడక్షన్ టెక్నిక్‌ల'పై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఇన్‌స్ట్రక్షనల్ మీడియా సెంటర్ డైరెక్టర్ రిజ్వాన్ అహ్మద్ తెలిపారు.

మహా శివరాత్రికి సర్వం సిద్ధం



పశుపతినాథ్ ఆలయ నమూనా



భరత్‌నగర్ కాలనీలోని పోచమ్మ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన నేపాల్ ద్వాదశ జ్యోతిర్లింగాలు

- ముస్తాబైన శైవ క్షేత్రాలు
- తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజలు

మూసాపేట: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పలు ఆలయాలు సిద్ధమయ్యాయి. భక్తులు ఉదయం నుంచే ప్రత్యేక పూజలు చేసుకునేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ ఆవరణలో టెంట్లు, దర్శనానికి క్యూ లైన్లు ఏర్పాటు ఏశారు. మరికొన్ని ఆలయాలు విద్యుత్ దీపాలతో, పూలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆయా ఆలయాలు శివనామస్మరణతో మారుమ్రోగనున్నాయి. దీంతో శివరాత్రి శోభను సంతరించుకున్నాయి.

ప్రత్యేక పూజలు..

ఆయా ఆలయాల్లో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. భరత్‌నగర్ కాలనీలోని హరిహర క్షేత్రంలో, మూసాపేట పాత శివాలయంలో పాపనాశేశ్వరస్వామి ఆలయం, కూకట్‌పల్లి పాత శివాలయం, ద్వాదశ జ్యోతిర్లింగ ఆలయాల్లో, కేపీహెచ్‌బీ కాలనీలోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు జరగనున్నాయి. ఉదయం 3.30 గంటల నుంచి అభిషేకాలు, అర్చనలు, గణపతి హోమం, రాత్రి శివపార్వతుల కల్యాణం, లింగోద్భవ అభిషేకాలు వంటి పూజలు ఉంటాయని, ఆదివారం కూడా ప్రత్యేక పూజలు ఉంటాయని భరత్‌నగర్‌కాలనీ శివాలయ అర్చకులు కృష్ణ సూరి తెలిపారు. భరత్‌నగర్ కాలనీలోని పోచమ్మ గ్రౌండ్‌లో ప్రజాపిత బ్రహ్మ కుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 30 అడుగుల నేపాల్ పశుపతినాథ్ ఆలయ నమూనా, ద్వాదశ జ్యోతిర్లింగాలు ఏర్పాటు చేశారు. ఫిబ్రవరి 20వ తేదీ వరకు భక్తుల సందర్శన ఉంటుందని ఆయన తెలిపారు.

పెరిగిన పూలు, పండ్ల ధరలు...

భరత్‌నగర్ కాలనీలోని మార్కెట్‌లో, కేపీహెచ్‌బీకాలనీలో రైతు బజార్ వద్ద పండ్లు, పూల ధరలు అమాంతంగా పెరగనున్నాయి. శివరాత్రి సందర్భంగా మిగతా రోజుల కంటే 30 శాతం ధరలు పెరగనున్నాయి. అయితే భక్తులు శుక్రవారం రోజే అధిక కొనుగోలు చేస్తూ సందడిగా కన్పించారు.



వ్యాపారం మాత్రం అంతగా లేదు



మిగతా రోజుల కంటే శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ధరలు పెరిగాయి. కానీ కొనుగోలు మాత్రం అంతంత మాత్రంగా ఉన్నాయి. రేట్లు పెరగడం, ఎండలు బాగా ఎక్కువగా ఉండటంతో వ్యాపారం మాత్రం అంతగా లేదు.

– బాలు, వ్యాపారి

ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తం సీఎంఆర్ఎఫ్



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని పలువురు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారికి మంజూరైన రూ.8.51లక్షల విలువైన చెక్కులను శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజా సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. సీఎంఆర్ఎఫ్ ఆపదలో ఉన్న వారిని ఆపన్న హస్తం అయ్యిందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్‌గౌడ్, మాధవరం రోజా దేవి, ఉప్పలపాటి శ్రీకాంత్, మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

శివరాత్రికి ప్రత్యేక బస్సులు

రాయదుర్గం: 'మహాశివరాత్రి' పర్వదినాన్ని పురస్కరించుకొని శివాలయాలకు వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక బస్సులను నడిపేందుకు గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ ఆర్టీసీ డిపో తగు ఏర్పాట్లు చేసినట్లు డిపో మేనేజర్ పి శ్రీనివాస్ తెలిపారు. ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ హెచ్‌సీయూ డిపో ద్వారా పటాన్‌చెరు బస్టాండ్‌లో ప్రత్యేక బస్సులను నడుపుతామన్నారు. సురక్షిత ప్రయాణానికి ఆర్టీసీ బస్సులే ఎంతో ఉపయుక్తమని ఆయన పేర్కొన్నారు.

ప్రశ్న: పండగ రోజు ఎన్ని బస్సులు నడుపుతారు?

జ: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పటాన్‌చెరు నుంచి బీరంగూడ వరకు ప్రత్యేకంగా 15 బస్సులను నడుపుతాం. ట్రాఫిక్‌ను బట్టి మరిన్ని షటిల్ బస్సులను పెంచడానికి కూడా సిద్ధంగా ఉన్నాం. అలాగే ఏడుపాయల జాతర సందర్భంగా పటాన్‌చెరు బస్టాండ్ నుంచి 21వ తేదీ వరకు 20 బస్సులను నడుపుతాం. పటాన్‌చెరు నుంచి దౌల్తాబాద్, హత్నూర మీదుగా జాతర జరిగే చోటు వరకు బస్సులు వెళ్తాయి.

ప్రశ్న: హెచ్‌సీయూ డిపో ద్వారా కొల్లూరుకు బస్సులు ఉన్నాయా?

జ: హెచ్‌సీయూ డిపో ద్వారా రూట్ నంబర్ 219/220 కె బస్సును కొత్తగా నడిపేందుకు నిర్ణయించాం. అయిదు బస్సులతో 40 నిమిషాల ఫ్రీక్వెన్సీతో సికింద్రాబాద్ నుంచి కేపీహెచ్‌బీ, లింగంపల్లి మీదుగా కొల్లూరు వరకు ఈ బస్సు నడుస్తుంది. సికింద్రాబాద్‌లో మొదటి బస్సు 6.55 గంటలకు, చివరి బస్సు రాత్రి 20.30 గంటలకు బయలు దేరుతుంది. అదేవిధంగా కొల్లూరు నుంచి మొదటి బస్సు ఉదయం 5.15 గంటలకు ప్రారంభమవుతుండగా రాత్రి 19.55 గంటలకు బయలు దేరుతుంది.

ఘనంగా ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు



కూకట్‌పల్లిలోని రామాలయంలో ప్రత్యేక పూజలు చేసిన కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యేలు, కార్పొరేటర్‌లు, డివిజన్ అధ్యక్షులు, పార్టీ నాయకులు కేక్‌లు కట్ చేసి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని పలువురు దేవాలయాల్లో పూజలు, ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వాన్ని దేశ ప్రజలంతా కోరుకుంటున్నారని తెలిపారు. రాబోయే రోజుల్లో దేశ రాజకీయల్లో సీఎం కేసీఆర్ మార్పు తీసుకు వస్తారని తెలిపారు. తెలంగాణను కోటి ఎకరాల మాగాణిగా మార్చిన రైతు బాంధవుడు, అద్భుత పాలనతో దేశాన్ని ఆలోచింప చేస్తున్న అనితర సాధ్యుడని కొనియాడారు. ప్రజల తలరాతలను మార్చే మహానీయుడుగా నిండు నూరేళ్ల వర్ధిల్లాలన్నారు.



జేఎన్‌టీయూహెచ్‌లో జరిగిన హరితహారంలో వీసీ కె.నర్సింహారెడ్డి, రెక్టార్ ఎ.గోవర్ధన్



విద్యార్థులకు పరీక్ష కిట్లను అందజేస్తున్న టీఎస్‌పీఎస్ చైర్మన్ జగన్‌మోహన్‌రావు



ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా బెలూన్లు ఎగరవేస్తున్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు

హెచ్‌సీయూ విద్యార్థి ఎన్నికల పరిశీలకుడిగా అయజ్‌కుమార్



ఆల్విన్‌కాలనీ: ఎన్ఎస్‌యూఐ జాతీయ కోఆర్డినేటర్ దాసరి రాజు అజయ్‌కుమార్‌ను హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి ఎన్నికలకు పరిశీలకుడిగా నియమితులయ్యారు. శుక్రవారం ఎన్ఎస్‌యూఐ తెలంగాణ ఇన్‌చార్జ్ అక్షయ్ లక్ర ఆయనను నియమించారు. ఎన్ఎస్‌యూఐ విద్యార్థి విభాగ నాయకుడిని గెలిచేందుకు తన వంతు కృషి చేస్తానని అజయ్ తెలిపారు.

భరతనాట్య ప్రదర్శన

మాదాపూర్: శివరాత్రిని పురస్కరించుకుని మాదాపూర్‌లోని శిల్పారామంలో శుక్రవారం నాట్యాచార్య డాక్టర్ పసుమర్తి రామలింగశాస్త్రి శిష్యబృందం భరతనాట్య ప్రదర్శన అలరించింది. ఇందులో శివశబ్దం అంశాలను ప్రదర్శించారు.

పర్యావరణ పరిరక్షణ అందిరి బాధ్యత

గచ్చిబౌలి: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈపీటీఆర్ఐ సైంటిస్టులు విద్యార్థులకు వివరించారు. శుక్రవారం గచ్చిబౌలిలోని ఈపీటీఆర్‌ని బాచుపల్లి ఓక్రిడ్జ్ విద్యార్థులు సందర్శించారు. పర్యావరణ పరిరక్షణ దిశగా పనిచేస్తున్న మిషన్ లైఫ్ గురించి సైంటిస్టు సునీల విద్యార్థులకు వివరించారు. జీవ వైవిధ్య పరిరక్షణలో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నివారించడం, నీటిని సంరక్షించడం, హెర్బల్ గార్డెన్, వేస్ట్ రీసైక్లింగ్ కాంప్లెక్స్, రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ గురించి వివరించారు. ప్రతి ఒక్కరు పర్యావరణ స్పృహతో జీవించాలని, మిషన్ లైఫ్ ప్రాముఖ్యతను తెలుసుకోవాలని ప్రిన్సిపల్ సెక్రటరీ, ఈపీటీఆర్ఐ డైరెక్టర్ జనరల్ వాణీప్రసాద్ సూచించారు.

పంచశీలలో శివరాత్రి వేడుకలు

మూసాపేట: మూసాపేటలోని పంచశీల స్కూలులో శుక్రవారం మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ పంచశీల శ్రీనివాస్, డైరెక్టర్ అనిత ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులు శివ పార్వతుల వేషధారణలో ఆకట్టుకున్నారు. అనంతరం భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టతల గురించి వివరించారు.



మిల్లెట్స్‌పై అవగాహన

సాక్షి సిటీబ్యూరో: మిల్లెట్స్ అంతర్జాతీయ దినోత్సవంను పురస్కరించుకుని నయా మిల్లెట్స్.. కామధేను ఫ్యూర్లీ నేచురల్స్ పేరిట '365 రోజులు..365 స్థలాలు..365 మందికి' అనే నినాదంతో శుక్రవారం అంజన్‌కుమార్ అనే వ్యక్తి అశోకా లివియానో టవర్స్‌లో రాగి ఇడ్లీ,పొంగల్, కిచిడీ అందజేశారు.

బ్రహ్మకుమారీస్ సేవలు ఆదర్శం

రామచంద్రాపురం (పటాన్‌చెరు): బ్రహ్మకుమారి సంస్థ చేస్తున్న సేవలు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాయని సినీ నటుడు మురళీమోహన్, సినీనటి జీవిత రాజశేఖర్ అన్నారు. శుక్రవారం బీహెచ్ఈఎల్‌లోని బ్రహ్మకుమారీస్ కేంద్రంలో శివ జయంతి కార్యక్రమానికి హాజరై మాట్లాడారు.

ఇద్దరు విటుల అరెస్టు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీకాలనీలో గుట్టు చప్పుడు కాకుండా వ్యభిచారం నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఓ ఇంటిపై గురువారం రాత్రి బాలానగర్ ఎస్ఓటీ పోలీసులు దాడి చేసి ముగ్గురు నిర్వాహకులు, ఇద్దరు విటులు, ఒక యువతిని అదుపులోకి తీసుకున్నారు. వీరితో పాటు వీరికి సహాయం చేస్తున్న ఇద్దరు యువకులను కూడా పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి 5 సెల్ ఫోన్లు, 800 నగదు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసిన వారిని తదుపరి విచారణ నిమిత్తం కేపీహెచ్‌బీ పోలీసులకు అప్పగించారు. ఈ దాడుల్లో సీఐ శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు, కానిస్టేబుళ్లు షారుక్, శ్రీనివాస్, రాంప్రసాద్, అరవింద్, సంగీత పాల్గొన్నారు.

గిరిజనులకు కేంద్రం నుంచి వచ్చే నిధులు విడుదల చేయాలి

- సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధర్మానాయక్
- ఘనంగా గిరిజన సంఘం మేడ్చల్ జిల్లా 3వ మహాసభ



కేపీహెచ్‌బీకాలనీలో జరిగిన గిరిజన సంఘం మహాసభలో అభివాదం తెలుపుతున్న నాయకులు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీకాలనీలో గిరిజన సంఘం మేడ్చల్ జిల్లా 3వ మహాసభ శుక్రవారం ఉత్సాహ పూరితంగా జరిగింది. ఈ సందర్భంగా గిరిజన సంఘం జెండాను జిల్లా అధ్యక్షుడు జే.శివనాయక్ ఎగరవేశారు. సభకు అధ్యక్షులుగా కె. కృష్ణ నాయక్, రాజు నాయక్ వ్యవహరించారు. తెలంగాణ గిరిజన సంఘం మూడో జిల్లా మహాసభలు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జే. శివనాయక్, ప్రధాన కార్యదర్శిగా ఆర్. చిరంజీవి, ఉపాధ్యక్షులుగా కె. కృష్ణ నాయక్, శంకర్‌నాయక్ పి.మాత్య, జానకిరామ్, సహాయ కార్యదర్శులుగా భాష, జోజయ, మంగ్య, శ్రీను, కృష్ణ, లక్ష్మణ్, నరేష్‌తో పాటు 15 మంది ఎన్నికయ్యారు.

◆ ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధర్మానాయక్ మాట్లాడారు. కేంద్రం నుంచి వచ్చే స్పెషల్ నిధులు గిరిజనులకు విడుదల చేయాలన్నారు. కేంద్రం అన్ని సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ గిరిజనుల అభివృద్ధిని ఆటంకం కలిగిస్తూ నిధులన్నీ పక్కదారిన మళ్లిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికీ ఎరువుల్లో, పెట్రోల్ డీజిల్, ఆహారపు సబ్సిడీల్లో కోతలు విధించిందన్నారు. ఉపాధి కూలీలకు పని దినాలు, నిధులు పెంచాల్సింది పోయి కోత విధిస్తే పేదలు ఏ విధంగా జీవనం సాగిస్తారో అర్థం కాని పరిస్థితి ఉందన్నారు. అదే విధంగా ఇక్కడి ముఖ్యమంత్రి గిరిజన బంధు ఇస్తానని ప్రకటించారని దానికి గిరిజనులు స్వాగతించాలన్నారు.

గిరిజన బంధు ఇవ్వాలి...

ఐదు ఎకరాలలోపు ఉన్న ప్రతి గిరిజనుడుకి గిరిజన బంధు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజనులకు కేటాయించే నిధుల్లో పూర్తిగా విద్యకే ఎక్కువ కేటాయించి అందులో నాణ్యత లేకుండా చేస్తున్నారని తెలిపారు. అర్హులందరికీ డబుల్ బెడ్రూమ్ ఇళ్లు ఇవ్వాలని కోరారు. లేకపోతే మేడ్చల్ జిల్లా ప్రాంతంలో ఉన్నటువంటి గిరిజనులను సమీకరించి పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

◆ సభకు మద్దతుగా పి.సత్యం మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ బాధ్యతను కోల్పోయి ప్రైవేట్ వారికి అప్పజెప్పి కార్యక్రమాలు చేస్తున్నారని అన్నారు.

◆ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కె. కృష్ణానాయక్ మాట్లాడుతూ... గిరిజన సంఘం పోరాటం ఫలితంగా 10శాతం రిజర్వేషన్ సాధించుకున్నామని అన్నారు. ఈ ప్రాంతంలో గిరిజన మహిళలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకిస్తూ ధర్నాలు చేసి ఆర్థిక సహాయాన్ని అందించామని తెలిపారు. అనేక దఫాలుగా ఇళ్ల పోరాటం చేశామని... ప్రైవేట్ స్కూళ్లలో ఫీజులు తగ్గించాలని డిమాండ్ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో బాలపీరు, రాజు, భాష, రాము, శంకర్ తదితరులు పాల్గొన్నారు.